క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో స్వామి జన్మ నక్షత్రమైన పునర్వసును పురస్కరించుకుని మంగళవారం కల్యాణం నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. జీలకర్ర బెల్లం, తలంబ్రాలు, మాంగల్యధారణ మహోత్సవం వంటి ఘట్టాలు కనుల పండుగగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వాదం, ప్రసాదం అందించారు. ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు ఏర్పాట్లు చేయగా ఆలయ కమిటీ చైర్మన్ పులవర్తి విశ్వనాథం, ఆలయ కమిటీ సభ్యులు తురగా సూర్యారావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు



పదోన్నతి పొందిన భవానీ శంకరరావు, గోవిందరాజులు, సత్యనారాయణమూర్తి

కాకినాడ రూరల్: మండలంలో పనిచేస్తున్న ముగ్గురు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీఓలుగా పదోన్నతులు లభించాయి. ఇంద్రపాలెం పంచాయతీ కార్యదర్శి యాళ్ల భవాని శంకరరావు, చీడిగ పంచాయతీ కార్యదర్శి బొబ్బిలి గోవిందరాజులు, వలసపాకల పంచాయతీ కార్యదర్శి ఆర్.సత్యనారాయణమూర్తిలకు పదోన్నతులు లభించాయి. ఏ మండాలనికి పదోన్నతిపై బదిలీ అయ్యారో జిల్లా కలెక్టరు ద్వారా ఆదేశాలు రావల్సి ఉంది. మంగళవారం ఎంపీడీఓ కార్యాయాలనికి వచ్చిన ముగ్గురు కార్యదర్శులు పదోన్నతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. వీరిని ఎంపీడీఓ ఎన్.సతీష్, డిప్యూటీ ఎంపీడీఓ సీతారామాంజనేయులు అభినందించారు.

రాజేష్‌కు యంగ్ అచీవర్స్ పురస్కారం



అవార్డులు అందుకుంటున్న రాజేష్

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి గ్రామానికి చెందిన కాకినాడ రాజేష్ సేవా కార్యక్రమాలకు యంగ్ అచీవర్ పురస్కారంతో పాటు బుక్ ఆఫ్ రికార్డు అవార్డును అందుకున్నారు. గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నుంచి పాండిచ్చేరిలోని కుంభ కళింగ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖల చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్టు మంగళవారం ఆయన మీడియాకు తెలియజేశారు. రాజేష్‌ను ఈ సందర్భంగా ఊపిరి ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వర్మ, మానవత్వం ఫౌండేషన్ డాక్టరు జొన్నలగడ్డ రాజు, చేయూత అధ్యక్షుడు డాక్టర్ మొండి రవికుమార్, వాకలపూడి గ్రామస్తులు అభినందించారు.

జేసీ మీనాకు ఘన వీడ్కోలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు ఘనంగా వీడ్కోలు పలికారు. కలెక్టర్ కార్యాలయంలో ఉన్న పీజీఆర్ఎస్ భవనంలో మంగళవారం రాత్రి ఆయనకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎస్పీ జి.బిందు మాధవ్, ట్రైనీ కలెక్టర్ మనీష, ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, ఎం.శ్రీరమణిలతో పాటు పలువురు జిల్లా అధికారులు, కాకినాడ జిల్లాలో ఉన్న తహసీల్దార్లు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

యువతికి చేయూత



తేజస్విని వైద్యానికి ఆర్థిక సాయం అందిస్తున్న హరీష్

బోట్‌క్లబ్: ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న ఒక యువతికి అరుదైన వ్యాధి సోకడంతో చేతులు, కాళ్లు సక్రమంగా పనిచేయడకపోవడంతో ఆమెకు సానా సతీష్‌బాబు ఫౌండేషన్ అండగా నిలిచింది. ఆమెకు ప్రతి నెలా ఫిజియో థెరపీకి అయ్యే ఖర్చును భరిస్తోంది. ఈ మేరకు చెక్కును స్థానిక సూర్యారావు పేటలోని బాధితురాలు పోలిశెట్టి గంగా తేజస్వినికి ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ అందించారు. ఈ కార్యక్రమంలో సానా సతీష్‌బాబు కార్యాలయ ఇన్‌చార్జ్ మేకా లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

నిర్మాణానికి నాలుగేళ్లు..

ప్రారంభానికి మీనమేషాలు!

- జేఎన్టీయూకేలో పూర్తయిన పీజీ హాస్టల్
- విద్యార్థులకు అందుబాటులోకి రాని వైనం
- అసౌకర్యంతో విద్యార్థుల అవస్థలు
- రేపు, మాపు అంటున్న అధికారులు



పూర్తయిన పీజీ హాస్టల్ భవనం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ కాకినాడ కళాశాలలో ఈ ఏడాది కొత్తగా చేరిన విద్యార్థులకు వసతి గృహం ఆశలు ఆవిరయ్యాయి. భవన నిర్మాణం పూర్తయ్యి ఏడాది గడిచినా నేటికి దానిని ప్రారంభించి వినియోగంలోకి తీసుకురాలేదు. గత ప్రభుత్వ హయాంలో నిధులు విడుదలై ప్రారంభానికి వీలుగా పనులు వేగవంతం చేసినా నేటికి దాని ప్రారంభించడానికి సన్నాహాలు చేయలేదు. కళాశాలలో మొదట కేవలం ఇంజినీరింగ్ విద్యార్థులకు మాత్రమే వసతి సదుపాయం ఉండేది. ఎంటెక్, ఎంసీఏ, ఎంబీఏ వంటి పీజీ కోర్సులకు కేవలం తరగతులు తప్ప వసతి సదుపాయం లేకపోవడంతో వారు ప్రైవేట్ హాస్టళ్లపై ఆధారపడుతున్నారు. దీంతో దాదాపు 300 వరకూ ఉండే పీజీ విద్యార్థులు చాలా అవస్థ పడేవారు. ముఖ్యంగా మహిళలకు చాలా అసౌకర్యంగా ఉండేది. పీజీ కోర్సులలో చేరిన మహిళా విద్యార్థులలో ఏడాదికి ఐదు నుంచి పది వరకు డ్రాపౌట్స్ ఉండేవి. హాస్టళ్లు సరిపడక చివరకు స్టూడెంట్ ఎమినిటీ భవనం పై అంతస్తులో ఉన్న క్యాంటిన్ హాల్, గదుల్ని విద్యార్థుల వసతికి వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సమస్యపై గతంలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించి అప్పటి రూసా కో–ఆర్డినేటర్‌గా ఉన్న మాజీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు దృష్టి పెట్టారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 12, 13వ పంచవర్ష ప్రణాళికలలో భాగంగా రూసా పథకం ద్వారా వర్సిటీకు రూ.20 కోట్లు వచ్చాయి. ఈ పథకం ఉన్నత విద్యలో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రవేశపెట్టినది. ఈ నిధులతో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర మంత్రులచే శంకుస్థాపన చేయడంతో పాటు పనులు వేగవంతం చేశారు. దీంతో విద్యార్థులకు నూతన భవనాలు, ఆధునిక వసతి కల్పనకు మరింత ఊతం ఇచ్చింది.

రూసా నిధులలో కేంద్రం రూ.12 కోట్లు, రాష్ట్ర వాటా రూ.8 కోట్లు కలిపి రూ.20 కోట్లతో వర్సిటీలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. తొలి విడతగా రూ.10 కోట్లు విడుదల చేశారు. వీటిలో ఆరు కోట్లతో వసతి భవనాలు, నాలుగు కోట్లతో పాత భవనాల ఆధునీకరణ, ఆధునిక పరికరాలు తదితరవాటికి వినియోగించారు. అంతేగాక వర్సిటీలో దాదాపు రూ.50 కోట్లతో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీ, స్నాతకోత్సవ భవనాలు దాదాపు 75 శాతం పూర్తిచేశారు.

నవంబర్‌లో అందుబాటులోకి..



పీజీ హాస్టల్ భవనం వచ్చే నవంబర్‌లో విద్యార్థులకు అందుబాటులోకి తేచ్చేలా చర్యలు తీసుకుంటాం. రూసా నిధులు కావడంలో బిల్లులు అప్‌లోడ్ సమస్య వల్ల కాంటాక్టర్‌కు బిల్లు రాలేదు. ఈ వారంలో సమస్య పరిష్కరించి నవంబర్‌లో ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

– ఆర్.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్, జేఎన్‌టీయూకే

ఐటీఐ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్లకు ఐదో విడతలో భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఎంవీజే వర్మ మంగళవారం తెలిపారు. ఏదైనా ఆన్‌లైన్ సెంటర్ ద్వారా ఈ నెల 16వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న వారు అదే సాయంత్రం 6 గంటల్లోగా కాకినాడ ఐటీఐలో సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవాలని సూచించారు. అభ్యర్థులకు 17వ తేదీ ఉదయం 9 గంటల నుంచి కాకినాడ ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్లు కల్పించనున్నట్టు తెలిపారు.

17న జాబ్‌మేళా

బాలాజీచెరువు: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈనెల 17వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి జి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. శ్రీ గోపాల్ ఆటోమొబైల్ 26, అపోలో ఫార్మశీ 200, ఎస్‌బీఐ గ్రూప్ 130, టీమ్‌లీస్ సంస్థ 300 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయన్నారు. పదో తరగతి, ఆపైన ఉత్తీర్ణులైన విద్యార్థులు హాజరుకావచ్చని, ఇతర వివరాలకు 86398 46568 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

బ్యాంకు సీసీ, యానిమేటర్లను తొలగించాలి



కరప పోలీస్ స్టేషన్ ఎదురుగా రాస్తారోకో చేస్తున్న కూరాడ డ్వాక్రా మహిళలు



కరప పోలీస్ స్టేషన్ వద్ద డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న ఏపీఎం దేవి

- కరపలో డ్వాక్రా మహిళల రాస్తారోకో
- దోచుకున్న రూ.95 లక్షలు రికవరీ చేయాలి
- బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్

కరప: డ్వాక్రా సంఘాల సొమ్మును దోచుకున్నా పట్టించుకోని అధికారుల తీరును నిరసిస్తూ మండలం కూరాడలోని మహిళాశక్తి సంఘాల (డ్వాక్రా గ్రూపు) సభ్యులు మంగళవారం సాయంత్రం కరప పోలీస్‌స్టేషన్ వద్ద రాస్తారోకో చేసి ట్రాఫిక్‌ను స్తంభింపచేశారు. తమ సంఘాల నుంచి దోచుకున్న రూ.95 లక్షలు రికవరీ చేయాలని, అవినీతి, అక్రమాలకు పాల్పడిన బ్యాంకు సీసీ, యానిమేటర్లను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కూరాడలోని 106 మహిళాశక్తి సంఘాలకు చెందిన ముగ్గురు యానిమేటర్లు పొదుపు, రుణాల వాయిదా సొమ్మును స్థానిక వేళంగి ఎస్‌బీఐ బ్రాంచ్ బీసీ పాయింట్‌కు చెల్లించకుండా సొంతానికి వాడుకున్న విషయం తెలిసిందే. ఇందుకు కారణమైన కరస్పాండెంట్‌గా చిన్నం ప్రియభారతి, ఆమెకు తల్లి అయిన యానిమేటర్ మరో ఇద్దరితో కలసి ఈ సొమ్ములు సొంతానికి వాడుకున్నారన్న ఆరోపణలపై ఈ రాస్తారోకో నిర్వహించారు. ఈ విషయమై గత నెల 29న జెడ్పీ సమావేశంలో ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ పీడీ విచారణ జరిపి ఏపీఎం ఎంఎస్‌బీ దేవి కూరాడలో రెండు బ్యాంకు ఖాతాలు పరిశీలించగా రూ.95 లక్షలు స్వాహాచేసినట్టు గుర్తించారు. దీనిపై బ్యాంక్ సీసీ, యానిమేటర్లపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికారుల తీరును నిరసిస్తూ కరపలో ఆందోళన చేశారు. ఈ మేరకు గ్రామంలోని గ్రూపు సభ్యులందరూ సమావేశమై యానిమేటర్లను తొలగించాలని కోరుతూ తీర్మానం చేయాలన్నారు. పీడీ జైపూర్ శిక్షణకు వెళ్లారని, వచ్చిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటారని సిబ్బంది చెప్పిన సమాధానం నచ్చకపోవడంతో డ్వాక్రా మహిళలు రాస్తారోకో చేశారు. దోచుకున్న సొమ్మును తిరిగి చెల్లించాలని, అవినీతికి పాల్పడిన యానిమేటర్లను, బ్యాంక్ సీసీని తొలగించి, న్యాయం చేయాలని కోరుతూ డ్వాక్రా మహిళలు సంతకాలు చేసి కరప పోలీస్‌స్టేషన్‌లో, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి సీఐకి నివేదిస్తామని, బాధ్యులైనవారిపై చర్యలు తీసుకుంటారని పోలీసులు చెప్పడంతో డ్వాక్రా మహిళలు వెనుతిరిగారు.

వైఎస్సార్ సీపీ కమిటీలకు పలువురి నియామకం



సూర్యప్రకాశరావు



ఇజ్జపురెడ్డి శ్రీను



పుల్ల చందు



సయ్యద్ నాసావల్లి



మోకా కృష్ణంరాజు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలను వివిధ హోదాలలో మంగళవారం నియమించారు. వారి వివరాలను పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ప్రకటించింది. వారికి రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు అభినందనలు తెలియజేశారు.

రూరల్ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు

యువజన విభాగానికి పుల్ల చంద్రశేఖర్ (చందు), బీసీ సెకు కాదా వెంకటేశ్వరరావు, ఎస్టీ సెల్‌కు గాడా నాగదుర్గా ప్రసాద్, మైనార్టీ సెల్‌కు నాస వల్లీ, మున్సిపాలిటీ విభాగానికి ఇజ్జపురెడ్డి శ్రీను, వలంటీర్ల విభాగానికి మోకా కృష్ణంరాజు, వీవర్స్ విభాగానికి కాదా సత్యనారాయణ, వైఎస్సార్ టీయూసీకి పలివెల విజయ్‌కుమార్, సోషల్ మీడియా విభాగానికి ముంజరపు సూర్యకిరణ్ నియమితులయ్యారు.

కాకినాడ రూరల్ మండల పార్టీ కమిటీకి..

ఉపాధ్యక్షులుగా రామదేవు సూర్య ప్రకాశరావు (చిన్నా), గరికిన అప్పన్న, జనరల్ సెక్రటరీలుగా నందిపాటి ధర్మరాజు, గుడాల సత్యానందం, ఇరసపు వీర వెంకట అప్పారావు, చవ్వాకుల వెంకట నాగేశ్వరరావు (శ్రీను), కార్యదర్శులుగా తర్లంపూడి గురుమూర్తి (నాని), పాటి నాగు, దువ్వా సత్తిబాబు, ఎలుగంటి నూకరాజు, గంది వాసు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా గంటా సత్తిబాబు, కుసుమరెడ్డి రత్నం, అనుసూరి వాసు, నల్లా సత్యనారాయణ, వాసర్ల వీరవెంకట నాగేశ్వరరావు, రావు గణేష్, చవ్వాకుల సుధీర్, మల్లాడి దుర్గా మల్లేశ్వరరావు, దెయ్యాల అప్పారావు, కోన ప్రసాద్, జంగం సత్తిబాబు, గరగ ప్రభాకర్ నియమితులయ్యారు.

కరప మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎస్‌కే దరియా మొహిద్దీన్ నియమితులయ్యారు.

కాకినాడ రూరల్ మైనార్టీ సెల్ కమిటీకి..

ప్రెసిడెంట్‌గా షేక్ సందాని, వైస్ ప్రెసిడెంట్లు ఎండీ చాంద్ బాషా, ఎండీ కాజా మొహిద్దీన్, జనరల్ సెక్రటరీలుగా షేక్ కరీం, షేక్ అబ్దుల్ బతుల్, షేక్ అన్సారీ బేగ్, సెక్రటరీలుగా షేక్ జానీ మహ్మద్, సయ్యద్ జహిరుద్దీ గౌస్, సయ్యద్ మక్బల్ మోహిద్దీన్, షేక్ షెషన్‌షా వలీ, షేక్ జానీ, ఎగ్జిక్యూటివ్ సభ్యులు– షేక్ ఇస్మాయిల్, ఎండీ కరీముల్లా, ఎస్‌కే ఫరూక్ అలీ, షేక్ నాగూర్ సాహెబ్, షేక్ మస్తాన్, ఎస్‌కే అమీన్, షేక్ అహ్మద్ నియమితులయ్యారు.

కాకినాడ రూరల్ మండల ఎస్సీ సెల్ కమిటీ

అధ్యక్షుడిగా ఊబా శ్రీను, ఉపాధ్యక్షులుగా పిట్ల లక్ష్మీనారాయణ, సవరపు నాగరాజు, జనరల్ సెక్రటరీలుగా మద్రే థామస్ విక్టర్, గుండుబిల్లి శ్రీనుచంద్ర, సెక్రటరీలుగా సలాది రాజబాబు, దూలపల్లి శంకరయ్య, బయ్యా శ్రీను, బుడితి రాకేష్ కుమార్, ఏనుగుపల్లి సుబ్రహ్మణ్యం, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఈరుగుల రాజేష్, లంకా రాజు, బర్రే రమణ, నేరుడుమిల్లి రత్నరాజు, మాతా సంపత్ కుమార్, ముంజరపు దుర్గాప్రసాద్, సిద్ధాంతపు ఆనందరావు నియమితులయ్యారు.

పోర్టుల్లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



యాంకరేజ్ పోర్టులో భద్రతా చర్యలపై చర్చిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ రూరల్: కాకినాడ సీ పోర్టు, యాంకరేజ్ పోర్టులను జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు పోర్టుల్లో పలు విభాగాలను సందర్శించి భద్రతా చర్యలపై సమీక్షించారు. రికార్డులు పరిశీలించారు. యాంకరేజ్ పోర్టు పరిధిలోని చెక్ పోస్టుల పనితీరుపై ఆరా తీశారు. సిబ్బందిని కలిసి, భద్రతా అంశాలపై దృష్టి సారించారు. చెక్ పోస్టు సిబ్బందికి భద్రత, విజిలెన్స్, రికార్డు నిర్వహణ తదితర అంశాలపై సూచనలు చేశారు. ఎస్సై పి.పవన్ కుమార్, సిబ్బందికి కూడా పలు సూచనలు ఇచ్చారు. సీ పోర్ట్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెండ్ కెప్టెన్ జాకబ్ సత్యరాజు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాసరావు, సెక్యూరిటీ ఆఫీసర్ సూర్యనారాయణలు భద్రతా చర్యల గురించి ఎస్పీకి వివరించారు. పోర్టు భద్రతను మరింత బలోపేతం చేయడానికి సాంకేతిక పరికరాలు, సీసీ కెమెరా పర్యవేక్షణ, అలర్ట్ రెస్పాన్స్ సిస్టమ్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని వారికి ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ కేవీవీ సత్యనారాయణ, ఎస్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పిఠాపురం: గొల్లప్రోలు మండలం బి.ప్రత్తిపాడు జంక్షన్ వద్ద 216 జాతీయ రహదారిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. పేద ప్రజలకు పంపిణీ చేసిన రేషన్ బియ్యం అక్రమ రవాణా అవుతోందన్న సమాచారం మేరకు పోలీసులు ఏలేశ్వరం సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, స్థానిక రెవెన్యూ అధికారులతో సంయుక్తంగా గొల్లప్రోలు 216 జాతీయ రహదారిలో బి.ప్రత్తిపాడు జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా దానిలో 3780 కేజీల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. వాటి విలువ రూ.1,73,880 ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ బియ్యాన్ని తరలిస్తున్న పిఠాపురం మండలం బి. ప్రత్తిపాడుకు చెందిన నందిపాటి వీరబాబు అనే వ్యాన్ డ్రైవరును అదుపులోకి తీసుకున్న అధికారులు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్టాక్ పాయింట్‌కు అప్పగించారు. నిందితుడి వాహనాన్ని గొల్లప్రోలు పోలీసులకు అప్పగించారు.

బౌద్ధం మంచి జీవన విధానం



కాకినాడలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న బౌద్ధులు

బోట్‌క్లబ్: బౌద్ధం మంచి జీవన విధానమని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, రచయిత చల్లపల్లి స్వరూపరాణి పేర్కొన్నారు. అంబేడ్కర్ బుద్ధ విహార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అంబేడ్కర్ బౌద్ధ ధర్మ దీక్ష దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంబేడ్కర్ సుమారు 21 సంవత్సరాల పరిశోధన, ఆచరణ అనంతరం బుద్ధ ధర్మాన్ని స్వీకరించడం ప్రపంచ చరిత్రలో అత్యంత ప్రాచుర్యం పొందిన అంశమన్నారు. లక్షలాది మందిని ప్రభావితం చేసి సామాజిక సాంస్కృతిక విప్లవానికి నాంది పలికారన్నారు. బౌద్ధం ఎంతో శాస్త్రీయమైన సిద్ధాంతం అని, అందుకే అంబేడ్కర్ ఒక్కరే కాకుండా కుటుంబాలు కుటుంబాలతో లక్షలాదిగా స్వీకరించారని పేర్కొన్నారు. ఏదీ శాశ్వతం కాదని నిత్యం మారుతూ ఉంటాయని మీరు కూడా సత్యాన్వేషణ ద్వారా హేతువాద దృష్టితో ఆచరించాలని బుద్ధుడు చెప్పారన్నారు. అంబేడ్కర్ బుద్ధవిహార్ అధ్యక్షుడు బాబ్జీ బౌద్ధ పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం కాకినాడ పుర వీధులలో బుద్ధం ధమ్మం సంఘం శరణం గచ్ఛామి నినాదాలతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఇంద్రపాలెం బ్రిడ్జి వద్ద గల బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

భక్తిశ్రద్ధలతో స్వాధ్యాయ మహా యజ్ఞం



పాల కావడి ఉత్సవంలో పాల్గొన్న స్వాములు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

- కన్నె స్వాములతో కావిళ్ల ఊరేగింపు
- సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి క్షీరాభిషేకం

బోట్‌క్లబ్: స్థానిక భానుగుడి జంక్షన్‌లోని పోలీస్ రిజర్వ్‌లైన్ అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అయ్యప్ప స్వాధ్యాయాన్ని డాల్ఫిన్ గార్డెన్ రెస్టారెంట్ అధినేత బదిరెడ్డి వెంకన్న స్వామి ఆధ్వర్యంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పాల కావడి పూజతో పాటు అయ్యప్ప పడి పూజను కుమార్ వేలు గురు స్వామి, మాధవ కృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, స్వామివార్లకు అభిషేకాలు, అయ్యప్ప శతనామావళి, దేవతామూర్తుల వేషధారణలతో చండీ మేళ వాయిద్యాలతో 108 కన్నె స్వాములు పాల కావిళ్లను పురవీధులలో ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మందిరంలో స్వామిని 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకించారు. నల్లమిల్లి మాచారెడ్డితో పాటు వందలాది అయ్యప్ప మాలధారులు చందనాభిషేకం, పుష్పాభిషేకం, భస్మాభిషేకం, సహస్ర నామార్చన చేశారు. మధ్యాహ్నం అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. వందలాది మంది అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

విపత్తుల నిరోధంపై అవగాహన అవశ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎఫ్ఓ సాయి రాజేష్

బాలాజీచెరువు: విపత్తుల సమయాల్లో నష్ట ప్రభావాన్ని సాధ్యమైనంత తగ్గించే చర్యలపై అందరికీ అవగాహన అవసరమని జిల్లా అగ్నిమాపక అధికారి సాయి రాజేష్ అన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ 'మై భారత్' ఆధ్వర్యంలో కాకినాడ రాజీవ్ గాంధీ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ విపత్తు తగ్గింపు దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అగ్నిమాపక అధికారి సాయి రాజేష్ హాజరై మాట్లాడుతూ ఏటా అక్టోబర్ 13న ప్రపంచ వ్యాప్తంగా 'అంతర్జాతీయ విపత్తు తగ్గింపు దినోత్సవం' నిర్వహిస్తున్నామని, విపత్తులు సంభవించినపుడు ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలు తగ్గించే మార్గాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. భూకంపాలు, తుపానులు, వరదలు, అగ్ని ప్రమాదాలు, కొండచరియలు వంటి ప్రకృతి విపత్తులు ఎప్పుడైనా సంభవించవచ్చునని, సరైన జాగ్రత్తలు తీసుకుంటే వాటి ప్రభావాన్ని తగ్గించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ విపత్తు నిరోధక చర్యలను నేర్చుకోవడం, వాటిని ఆచరించడం సమాజానికి రక్షణ కవచంగా ఉంటుంది. ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి, విపత్తు నిర్వహణలో భాగస్వాములై సురక్షితమైన, స్థిరమైన భవిష్యత్తు నిర్మాణంలో మనందరి పాత్ర కీలకం కావాలన్నారు. కార్యక్రమంలో రాజీవ్ గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ, నెస్స్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజు పాల్గొన్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

కొత్తపల్లి: ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు మండలంలోని అమరవల్లి గ్రామానికి చెందిన రావాడ పద్మకుమారి డ్వాక్రా సంఘంలో అవకతవకలు జరిగాయని డ్వాక్రా వీఓఏను ప్రశ్నించింది. దీంతో వీఓఏ కుటుంబ సభ్యులు తనను కొట్టడానికి వచ్చారని పద్మకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదే గ్రామానికి చెందిన డ్వాక్రా వీఓఏ దల్లి అపర్ణ తనపై కొందరు వ్యక్తులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదు చేసింది. ఇరువురి ఫిర్యాదుల మేరకు ఎస్సై వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయ ముఖ ద్వారానికి విరాళం



ఈఓకు విరాళం అందజేస్తున్న దాతలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడ సూర్యారావుపేటలోని బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న ముఖ ద్వారానికి భారీ విరాళం అందజేశారు. నగరానికి చెందిన బిరాడ సూర్యనారాయణ, వీర ప్రభావతి దంపతులు రూ.లక్షా 116 నగదును ఈఓ ఉండవల్లి వీర్రాజుకు మంగళవారం అందించారు.